RAKSHANA_praja jyothi Medhak.qxd 2/18/2026 2:01 AM Page 1


# రక్షణ
## ఉమ్మడి గుంటూరు

బుధవారం 18 ఫిబ్రవరి 2026 పేజీలు : 4


## వినుకొండలో సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



**వినుకొండ పట్టణంలో ఈ నెల 21న నిర్వహించనున్న స్వచ్ఛ-ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మంగళవారం పట్టణంలో పర్యటించారు. సీఎం పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్, సభాస్థలి తదితర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.**

ఫిబ్రవరి 21న వినుకొండ పట్టణంలో జరగనున్న స్వచ్ఛ-ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మంగళవారం ఉదయం వినుకొండ పట్టణంలో **మిగతా 2లో** వినుకొండ రక్షణ న్యూస్




## ప్రాణదాతలకే ...

# అత్యున్నత గౌరవం.



**నమ్మకంతో సేవలందించాలి... లాభాపేక్షకు తావులేకుండా వైద్యం మంత్రి నారా లోకేష్...**

**జీవితం--మరణం మధ్య నిలబడి ప్రాణాలను కాపాడే వైద్యులకే సమాజంలో అత్యున్నత గౌరవం లభిస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని ఎయిమ్స్ మంగళగిరి స్నాతకోత్సవంలో ఆయన పట్టభద్రులకు సేవాభావం, నైతికత, నమ్మకం అనే విలువలతో వైద్య వృత్తిని కొనసాగించాలని సూచించారు.**

వైద్యులు జీవితం--మరణం మధ్య నిలబడి ప్రాణదాతలుగా సేవలందిస్తున్నందునే సమాజంలో అత్యున్నత గౌరవాన్ని పొందుతున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళగిరిలోని ఎయిమ్స్ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పట్టభద్రులకు సేవాభావం, నైతికత, వినయంతో వైద్యవృత్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.మంత్రి మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రి ఆవరణలో భయం, **మిగతా 2లో** మంగళగిరి రక్షణ న్యూస్

## రషీద్ కుటుంబానికి వైఎస్ జగన్ ఫోన్ పరామర్శ

వినుకొండలో జరిగిన రషీద్ హత్య ఘటనతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబాన్ని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. కుటుంబానికి ధైర్యం చెబుతూ, పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



వివరాలు 2లో..

# బైక్‌పై ఎస్పీ వకుల్..



**గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కార దిశగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ద్విచక్ర వాహనంపై క్షేత్రస్థాయిలో పర్యటించారు. ట్రాఫిక్ రద్దీ, డైవర్షన్లు, ఆక్రమణలు ఉన్న ప్రాంతాలను పరిశీలించి, నియంత్రణ చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.**

వివరాలు 2లో..

## ఎమ్మెల్యే ఇంట్లో భారీ చోరీ..

# భద్రత పై ప్రశ్నలు.



**గుంటూరు జిల్లా పొన్నూరు మండలం చింతలపూడిలో టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తల్లి నివాసంలో భారీ చోరీ జరిగింది. సుమారు 35 లక్షల రూపాయల విలువైన బంగారం, వెండి, నగదు అపహరణకు గురైనట్లు సమాచారం. ఎమ్మెల్యే కుటుంబానికి చెందిన ఇంట్లోనే ఈ ఘటన జరగడం స్థానికంగా కలకలం రేపుతోంది.**

పొన్నూరు మండలం చింతలపూడిలోని టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తల్లి ధూళిపాళ్ల ప్రమీలాదేవి నివాసంలో చోరీ **మిగతా 2లో** రక్షణ న్యూస్ క్రైమ్

# బైక్‌పై ఎస్పీ వకుల్...

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపీఎస్ మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై నగరం మొత్తం పర్యటించారు. శంకర్ విలాస్ నిర్మాణ పనుల నేపథ్యంలో పలుచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయనే సమాచారం మేరకు, సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కంకరగుంట అండర్‌పాస్, గుజ్జనగుండ్ల సెంటర్, కోరిటపాడు రోడ్, ఎన్టీఆర్ స్టేడియం సర్కిల్, లక్ష్మీపురం మెయిన్ రోడ్, మదర్ థెరిస్సా స్టాట్యూ సెంటర్, లాడ్జ్ సెంటర్, శ్రీనగర్ మెయిన్ రోడ్, మూడు వంతెనల అండర్‌పాస్, కొత్తపేట శివాలయం జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, బీఆర్ స్టేడియం సర్కిల్, రైల్వే స్టేషన్, కోర్ట్ రోడ్ తదితర ప్రధాన కూడళ్లను పరిశీలించారు.రోడ్లపై ఆక్రమణలను మున్సిపల్ అధికారుల సహకారంతో వెంటనే తొలగించాలని, వ్యాపార సముదాయాల ముందర రోడ్లపై వాహనాలు నిలపకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రైవేట్ బస్సులు, ఆటోలు నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానాలు విధించాలని సూచించారు.ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బంది సమయానికి విధి ప్రదేశాలకు చేరుకోవాలని, ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే స్పందించి పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పోలీసులకు సహకరించాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా నగర ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్యలు ట్రాఫిక్ పరిస్థితులను ఎస్పీకి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు డీఎస్పీలు, సీఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంట్లో భారీ చోరీ..

మొదటి పేజీ తరువాయి

జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి సుమారు 50 తులాల బంగారం, 10 కిలోల వెండి, లక్ష రూపాయల నగదును అపహరించినట్లు పోలీసులు తెలిపారు. మొత్తం విలువ దాదాపు 35 లక్షల రూపాయలుగా అంచనా వేస్తున్నారు.ప్రమీలాదేవి గుంటూరులో ఉన్న తన కుమారుడి ఇంటికి వెళ్లిన సమయంలో ఈ చోరీ జరిగినట్లు సమాచారం. ఆమె ఫిర్యాదు మేరకు పొన్నూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తోంది.ఒక ఎమ్మెల్యే కుటుంబానికి చెందిన ఇంట్లోనే ఇంత భారీ చోరీ జరగడం భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. దుండగుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు ఎస్పై శ్రీహరి తెలిపారు.

# వినుకొండలో సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

మొదటి పేజీ తరువాయి

పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ స్థలాన్ని, ఎన్ఎస్‌పి కాలనీ గ్రౌండ్‌లో జరగనున్న సభాస్థలిని ఆమె పరిశీలించారు. అలాగే స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలోని బయోమెడికల్ వేస్ట్ స్టోరేజ్ గదిని తనిఖీ చేసి, అవసరమైన సూచనలు అధికారులకు ఇచ్చారు.అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, సీఎం పర్యటనను విజయవంతం చేయడానికి సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధులత, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య, విద్యుత్, పురపాలక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణదాతలకే అత్యున్నత గౌరవం.

మొదటి పేజీ తరువాయి

బాధ, ఆశ కలిసిన వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. అత్యవసర వార్డులోకి వచ్చే రోగి కళ్లలో కనిపించే నమ్మకాన్ని గుర్తించి సేవలందించాలన్నారు. "మీరు కేవలం మందులు ఇవ్వడం కాదు, ఆశను నింపుతున్నారు" అని అన్నారు. కోవిడ్-19 సమయంలో వైద్యులు ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారని గుర్తుచేశారు.దినదిన ప్రవర్ధమానంగా ఎదిగిన ఎయిమ్స్2015లో సాధారణ స్థాయిలో ప్రారంభమైన ఎయిమ్స్ మంగళగిరి నేడు సమగ్ర వైద్య, విద్యా సంస్థగా అభివృద్ధి చెందిందన్నారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ కోర్సులతో 1,300 మందికి పైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారని తెలిపారు. కొన్ని పడకలతో ప్రారంభమైన ఆసుపత్రి ప్రస్తుతం దాదాపు 650 పడకలతో సేవలందిస్తోందని చెప్పారు. ఓపెన్ హార్ట్ సర్జరీలు, కిడ్నీ మార్పిడి, రోబోటిక్ మోకాళ్ల శస్త్రచికిత్సలు, ఆధునాతన ఆంకాలజీ, క్యాథ్ ల్యాబ్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు. ఇప్పటివరకు 45 లక్షలకు పైగా ల్యాబ్, డయాగ్నస్టిక్ సేవలు అందించబడినట్లు తెలిపారు.

**మీరు ఈ దేశపు నిజమైన హీరోలు**

సాంకేతికత వేగంగా మారుతున్నప్పటికీ వైద్యుడి స్పర్శకు సాటి లేదని మంత్రి పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు సహాయక సాధనం మాత్రమేనని, అది మానవత్వాన్ని భర్తీ చేయలేదన్నారు. చదవడం, లోతుగా ఆలోచించడం వైద్యుడి జీవితాంత అభ్యాసానికి మూలమని సూచించారు. గిరిజన, మారుమూల ప్రాంతాల్లో సేవలందించి అక్కడి ఆరోగ్య సమస్యలను అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విధినిర్వహణలో నైతికత మరువద్దులాభాపేక్షతో మందులు సూచించవద్దని, సౌకర్యం కోసం రాజీ పడవద్దని మంత్రి హితవు పలికారు. తెల్ల కోటు గౌరవాన్ని కాపాడాలని, వినయం వైద్యుడి గొప్ప లక్షణమని అన్నారు. ప్రతి వైద్యుడి వెనుక తల్లిదండ్రులు, గురువుల త్యాగం ఉందని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, రసాయన, ఎరువుల శాఖ మంత్రి అనుప్రియ పటేల్, ఎయిమ్స్ మంగళగిరి అధ్యక్షులు మేజర్ జనరల్ డా. తపన్ కుమార్ సాహా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. అంతం శాంత సింగ్ పాల్గొన్నారు.

# ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబాటు.

**రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్..**

**తాడికొండ రక్షణ న్యూస్**

తుళ్లూరు మండలం మందడం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.మంత్రి సత్య కుమార్ యాదవ్ స్వయంగా విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలలో ఒకటి నుండి ఐదు సంవత్సరాల వయస్సు గల చిన్నారుల నుంచి, ఆరు సంవత్సరాల పైబడిన పాఠశాల, జూనియర్ కాలేజ్, పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీలలో చదువుతున్న విద్యార్థులు కలిపి మొత్తం 1,11,63,000 మందికి ఈ కార్యక్రమం ద్వారా నులిపురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో 76 లక్షల మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి



విద్యార్థికి డిజిటల్ హెల్త్ రికార్డులు ప్రభుత్వం రూపొందిస్తోందని మంత్రి వెల్లడించారు.నులిపురుగుల నిర్మూలన మాత్రలను వినియోగించడం వల్ల భవిష్యత్తులో వచ్చే అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని మంత్రి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి కుమార్, డి ఎం హెచ్ ఓ విజయలక్ష్మి అంగనవాడి మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# రషీద్ కుటుంబానికి వైఎస్ జగన్ ఫోన్ పరామర్శ

మొదటి పేజీ తరువాయి

**రక్షణ న్యూస్ వినుకొండ**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వినుకొండ పట్టణంలో నడి రోడ్డుపై రషీద్‌ను దారుణంగా హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తం గా తీవ్ర విషాదాన్ని కలిగించిన విషయం తెలిసిందే. ఈ ఘటనను తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన రషీద్ తండ్రి షేక్ ఫరీసా ఇటీవల ఆరోగ్యం క్షీణించి కన్నుమూశారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి రషీద్ తల్లి గారికి స్వయంగా ఫోన్ చేసి పరామర్శించారు. కుటుంబం ఎదుర్కొం టున్న బాధను అర్థం చేసుకుంటూ ధైర్యం చెప్పారు. ఈ కష్టకాల ంలో మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లా బ్రహ్మనాయుడు గారు మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎల్లప్పుడూ కుటుం బానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.రషీద్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పార్టీ పోరాటం చేస్తుందని కూడా జగన్ భరోసా ఇచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# పవర్ లిఫ్టింగ్ విజేతలను అభినందించిన కలెక్టర్ తమీమ్ అన్సారీయా

**గుంటూరు రక్షణ న్యూస్**



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అభినందించారు. కర్నూలు లో ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లోను, మరియు హరిద్వార్ లో జనవరి 17 నుంచి 21 వరకు ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోను విజేతలుగా నిలిచిన తుపాకుల నాగజ్యోతి, కె. సత్య రామరాజును గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సత్కరించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చిన విద్యార్థులు అభినందనీయులని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అధిక సంఖ్యలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు క్రమశిక్షణ, కఠిన సాధనతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కోచ్ ఎం.డి. ఖమ్రుద్దీన్, క్రీడాకారుల తల్లిదండ్రులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

RAKSHANA_praja jyothi Medhak.qxd 2/18/2026 2:01 AM Page 3



# పాఠశాలల క్రమానుగత తనిఖీలు తప్పనిసరి

## బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్..

**బాపట్ల రక్షణ న్యూస్**



స్వర్ణ వార్డుల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం, గురువారం వార్డు వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ సెక్రటరీలు తప్పనిసరిగా పాఠశాలలను సందర్శించి సమగ్ర తనిఖీలు చేపట్టాలని సూచించారు. తనిఖీల సమయంలో బోధన--అభ్యాస విధానం, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పారిశుద్ధ్య పరిస్థితులు వంటి అంశాలను విపులంగా పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్వహించిన తనిఖీలకు సంబంధించిన ఫోటోలు, వివరాలను సమగ్ర పర్యవేక్షణ నిర్వహణ వ్యవస్థ యాప్‌లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని తెలిపారు. ఇప్పటివరకు వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు నిర్వహిస్తున్న బాధ్యతలను ఇకపై వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ సెక్రటరీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, నివేదికలను నిర్ణీత గడువులో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డీఈవో శ్రీనివాస్ సింగ్, జీఎస్‌డబ్ల్యూ జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్ పాల్గొన్నారు. మండలాల ఎంఈవోలు వర్చువల్ విధానంలో సమావేశానికి హాజరయ్యారు.

# సేవా స్ఫూర్తి రెడ్ క్రాస్

### ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తూ, సేవా కార్యక్రమాలలో ముందంజలో ఉంటున్న రెడ్ క్రాస్ సభ్యులను అభినందించిన రాష్ట్ర మాజీ సైనికుల అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు..

**బాపట్ల రక్షణ న్యూస్**



బాపట్ల పట్టణంలో టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనం ఆవరణలో శిక్షణ మరియు సమావేశ మందిరం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. బాపట్ల జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు వాసుదేవ్ వినోద్ కుమార్ చేతుల మీదుగా ఈ మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణ భట్టు మరియు కమిటీ సభ్యులను రాష్ట్ర మాజీ సైనికుల అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ప్రత్యేకంగా అభినందించారు. దాతల సహకారంతో ఏర్పాటైన శిక్షణ, సమావేశ మందిరం జిల్లా స్థాయిలో సేవా కార్యక్రమాలకు మరింత బలం చేకూరుస్తుందని అభిప్రాయపడ్డారు.

"మానవ సేవే మాధవ సేవ" ఈ సందర్భంగా తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ, మానవ సేవే మాధవ సేవ అనే భావనతో బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అనేక సేవా కార్యక్రమాలతో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి కష్టం వచ్చినా అండగా నిలుస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల వారికే కాకుండా అవసరమైన సందర్భాల్లో అన్ని వర్గాల ప్రజలకు సేవలందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో సైతం ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందించే రెడ్ క్రాస్ సొసైటీ లో తాను కార్యవర్గ సభ్యునిగా ఉండటం గర్వంగా ఉందన్నారు. బాపట్ల జిల్లా కలెక్టర్‌గా మరియు రెడ్ క్రాస్ అధ్యక్షుడిగా సేవాతత్పరుడైన ఐఏఎస్ అధికారి డాక్టర్ వి. వినోద్ కుమార్ బాధ్యతలు నిర్వహించడం జిల్లా ప్రజలకు ఒక వరమని కొనియాడారు.

దాతలకు కృతజ్ఞతలు శిక్షణ మరియు సమావేశ మందిరం నిర్మాణానికి దాతలుగా ముందుకు వచ్చిన శ్రీ పి. నాగరాజు (చినబాబు), జాగర్లమూడి లక్ష్మీ, దొడ్డ నాగేశ్వరరావు గారులకు మాజీ సైనికుల తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా ఆదిశేషా రెడ్డి, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, జనరల్ సెక్రటరీ షేక్ మొయినుద్దీన్, జాయింట్ సెక్రటరీ పీటా సారధి, ట్రెజరర్ పువ్వాడ యల్లమంద, రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారులు సుంకర శేషగిరి రావు, జిల్లా అసోసియేషన్ ట్రెజరర్ షేక్ నిజాముద్దీన్, అలాగే బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత విస్తరించి ప్రజలకు మరింత మేలు చేయాలని ఆశాభావం వ్యక్తమైంది.

# ప్రజలకు సేవే ప్రధాన ధ్యేయం

### రెడ్ క్రాస్ నూతన శిక్షణా మందిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.

**బాపట్ల రక్షణ న్యూస్**



సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి తెలిపారు. బాపట్ల లో రెడ్ క్రాస్ సంస్థ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన శిక్షణ మరియు సమావేశ మందిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను రక్షించడం రెడ్ క్రాస్ సంస్థ ప్రధాన ధ్యేయమన్నారు. విపత్కర వేళల్లో తక్షణ స్పందన అందించేందుకు నిష్ణాతులైన వాలంటీర్లను తయారు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. నెలలో నాలుగు పర్యాయాలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా సంస్థ ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని తెలిపారు. సుమారు 60 మందికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిరంతర శిక్షణలు అందిస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో సంస్థ సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ో బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దార్ షాలీమా, రెడ్ క్రాస్ చైర్మన్ నారాయణ భట్టు, నాయకులు శివన్నారాయణ, రమణబాబు, చీరాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పురవీధుల్లో పరమేశ్వరుని దివ్య రథోత్సవం

### అమరావతిలో వేంచేసి ఉన్న అమరలింగేశ్వర స్వామి దివ్య రథోత్సవాన్ని ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, తదితర ఎమ్మెల్యేలు





**అమరావతి రక్షణ న్యూస్**

అమరావతిలో శ్రీ అమరలింగేశ్వరుని స్వామి దేవాలయ వార్షిక దివ్య రథోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా ప్రారంభమైంది. బాలా చాముండికా సమేత అమరేశ్వర స్వామి అలంకరించిన మహారథంపై పురవీధుల్లో విహరించగా, అమరావతి ఆధ్యాత్మికోత్సాహంతో మారుమోగింది. వేదఘోషలు, మంగళ వాయిద్యాలు, "హర హర మహాదేవ" నినాదాల మధ్య స్వామివారి రథయాత్ర ప్రారంభమైంది. రథోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గురజాల జగన్మోహన్ రావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, పులివర్తి నాని తదితరులు పాల్గొన్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు పల్నాడు జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి దివ్య దర్శనం కోసం భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, క్యూలైన్లు, వైద్య సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ మధ్య కూడా రథయాత్ర ప్రశాంతంగా కొనసాగుతోంది. స్వామివారి రథవిహారం ద్వారా సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అమరావతిలో జరిగిన ఈ దివ్య రథోత్సవం భక్తి, వైభవం, ఆధ్యాత్మిక ఉత్సాహానికి ప్రతీకగా నిలిచింది.

# నేతకు నివాళి

### మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు



**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు రూరల్ మండలం లాల్‌పురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు, గుంటూరు మాజీ ఎంపీపీ తోట లక్ష్మీ కుమారి భర్త తోట శివ మల్లికార్జునరావు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన పార్థీవ దేహానికి ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి, తోట శివ మల్లికార్జునరావు గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలోనే నిర్ణయాలు కీలకం

**గురువు ప్రోత్సాహమే జీవిత మలుపు అని తన విద్యాభ్యాస నాటి కొన్ని మరుపురాని సందేశాలను విద్యార్థులతో పంచుకున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్...**

**జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో విద్యార్థులకు కలెక్టర్ డా. వినోద్ కుమార్ సందేశం**



బాపట్ల రక్షణ న్యూస్

విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే విద్య, క్రమశిక్షణ, పట్టుదల అనేవి పరస్పర అనుసంధానమైన మూలాధారాలని జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్.వి పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వేటపాలెం మండలం దేశాయిపేటలోని ఎం.జె.పి ఏపి బిసి సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో కృషి చేసే విద్యార్థులే భవిష్యత్తులో నాయకులుగా ఎదుగుతారని అన్నారు. నిరంతర సాధన, అంకితభావం ఉంటే అసాధ్యం అనేది ఏదీ లేదని పేర్కొన్నారు. క్రమశిక్షణతో క్రీడారంగంలో అగ్రగామిగా నిలిచిన సచిన్ టెండూల్కర్ ఉదాహరణను ప్రస్తావిస్తూ, ప్రతిభను మెరుగుపరచుకోవడానికి పట్టుదల అవసరమన్నారు.తన విద్యార్థి దశలో ఒక ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో నేషనల్ టాలెంట్ టెస్ట్‌లో ఎంపికై జీవితంలో ముందడుగు వేసిన అనుభవాన్ని పంచుకుంటూ, గురువుల ప్రేరణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దగల శక్తి కలిగినదని తెలిపారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటం కూడా విద్యాభివృద్ధికి కీలకమని, అందుకే ప్రభుత్వం నులిపురుగుల నివారణ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తోందని వివరించారు. ఉపాధ్యాయులు ప్రతిభావంతులను గుర్తించి వారి సామర్థ్యాలను వెలికితీయాలని సూచించారు. పాఠశాలల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందే విధంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్. విజయమ్మ మాట్లాడుతూ, ఏడాది నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ జిల్లావ్యాప్తంగా మాత్రలు పంపిణీ చేస్తున్నామని, ఆరు నెలలకు ఒకసారి తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీఓ టి. చంద్రశేఖర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పరిశీలకులు డాక్టర్ నాగలక్ష్మి, రాజ్ కిరణ్, మలేరియా నివారణ జిల్లా అధికారి సోమ్లా నాయక్, డాక్టర్ జయకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ నహీదా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో రాజీకి తావులేదు

**గృహ నిర్మాణాలు , పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా**



గుంటూరు రక్షణ న్యూస్

జిల్లాలో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి ఉగాది నాటికి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి మండల ప్రత్యేక అధికారులు, ఎం.పి.డి.ఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు.జిల్లాలో 22,952 గృహాలను ఉగాది నాటికి పూర్తి చేయడం లక్ష్యమని పేర్కొంటూ, రోజువారీ మరియు వారాంత ప్రణాళికలు రూపొందించి కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందించబడిందని, ఉపాధి హామీ పథకం కింద 95 రోజుల పనివకాశం ఉందని తెలిపారు. బిల్లుల చెల్లింపులు ఆలస్యం లేకుండా జరుగుతాయని స్పష్టం చేశారు. గృహ నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేసిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.పి.యం.ఏ.వై 2.0 కింద రూ.2.50 లక్షల యూనిట్ వ్యయంతో మంజూరైన 1,755 గృహాల్లో ప్రారంభం కానివి వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులు మార్చి 31 నాటికి పూర్తి చేయాలని, పనుల్లో రాజీ పడరాదని స్పష్టం చేశారు. వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లు, అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు ఫిబ్రవరి 28లోగా పూర్తిచేయాలని తెలిపారు .చేబ్రోలు, దుగ్గిరాల, తెనాలి మండలాల్లో ప్రగతి మెరుగుపర్చాలని, గ్రామ పారిశుధ్య కమిటీల సమావేశాలు తరచుగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాపట్ల అభివృద్ధి--ఆధ్యాత్మికతపై ఎమ్మెల్యే చొరవ

**దేవాదాయ శాఖ మంత్రిని కలిసి కీలక వినతి పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ..**



బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ఆధ్యాత్మిక వైభవం పెంపు, పేదల సమస్యల పరిష్కారం లక్ష్యంగా బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాష్ట్ర సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామ నారాయణరెడ్డి ను కలిసి కొన్ని ప్రధాన అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు.బాపట్ల పట్టణంలోని ప్రాచీన సోమేశ్వర స్వామి వారి దేవాలయం పునర్నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేయాలని కోరారు. గతంలో ఇటుక కట్టుబడి కోసం రూ.1.10 కోట్లు మంజూరైనప్పటికీ, ఆలయ చారిత్రక ప్రాశస్త్యం దృష్ట్యా పూర్తి స్థాయి రాతి కట్టుబడితో నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు. ఇందుకు అదనంగా రూ.2 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని ప్రసిద్ధ గాంచిన శ్రీ భగలముఖి అమ్మవారి దేవస్థానం కు నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు, నిధులు కేటాయించాలని కోరారు. ఆలయ అభివృద్ధి ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని తూర్పు సత్రం వెనుక భాగంలో దశాబ్దాలుగా నివసిస్తున్న పది పేద కుటుంబాల స్థలాలను క్రమబద్ధీకరించాలని మంత్రిని అభ్యర్థించారు. సామాజిక న్యాయం దిశగా అవసరమని స్పష్టం చేశారు.నియోజకవర్గ అభివృద్ధి, ఆధ్యాత్మిక కేంద్రాల పరిరక్షణ, పేదల సంక్షేమం కోసం తాను న్యాయ సాధన దిశగా కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# వేసవి నీటి ఎద్దడి నివారణకు సమగ్ర కార్యాచరణ

**జిల్లా నీరు--పారిశుధ్య కమిటీ సమావేశంలో కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశాలు**



గుంటూరు రక్షణ న్యూస్

జిల్లాలో ఎక్కడా వేసవి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. జిల్లా నీరు, పారిశుధ్య కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో గ్రామ పంచాయతీ వారీగా నిధుల లభ్యత నివేదికలు సమర్పించాలని సూచించారు. గత సంవత్సరాల్లో తాగునీటి సమస్యలు తలెత్తిన మండలాలు, గ్రామాలను విశ్లేషించి ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసి, సమస్యాత్మక ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.బోరు బావుల మరమ్మతులు 24 గంటల్లో పూర్తి చేయడానికి అవసరమైన విడిభాగాలు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. తాడికొండ, మేడికొండూరు మండలాల నుండి తరచూ తాగునీటి ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఫోన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని ఆదేశించారు.జిల్లాలో మంజూరైన వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాల పనులు త్వరగా పూర్తి చేయాలని, 85 కేంద్రాల్లో ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి వివరాలు అందిస్తూ, జిల్లాలో 155 గ్రామాల్లో ఓడీఎఫ్ ప్లస్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. 113 స్లో సాండ్ ఫిల్టర్ల మరమ్మతులకు రూ.13.81 కోట్లు అవసరమని, రూ.2.67 కోట్లతో 34 పనులు ప్రారంభించి 26 పూర్తిచేశామని వెల్లడించారు. వేసవి నీటి ఎద్దడి నివారణలో భాగంగా 47 శాతం గ్రామాల్లో సర్వే పూర్తి చేశామని చెప్పారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి. ప్రసూన, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి. శంకర్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి. శ్రీనివాస్, భూగర్భ జలవనరుల శాఖ ఉపసంచాలకులు వి. వందనం తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కు వినతి

**ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యులను నియమించాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన సీపీఐ నాయకులు..**



వినుకొండ రక్షణ న్యూస్

వినుకొండ పట్టణ ప్రభుత్వాసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యులు లేకపోవడం వల్ల ప్రమాద బాధితులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవపూడి రాము తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలో తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ చికిత్స అందడం కష్టమవుతోందని పేర్కొన్నారు. ఆర్థోపెడిక్ నిపుణులు లేకపోవడంతో బాధితులను ఇతర పట్టణాలకు తరలించాల్సి వస్తోందని, దీనివల్ల సమయం నష్టం, అదనపు వ్యయం ఎదురవుతోందని తెలిపారు.వెంటనే ఆర్థోపెడిక్ వైద్యులను నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.